

# విశ్వనాథ సత్యనారాయణ

**దేవుడు వరమిచ్చినా, పూజారి వరమివ్వనట్టున్నది. అంతేకాదు. దేవుడు వరమిచ్చే దేవుడు. అడగటం ఆలస్యంగా ఇస్తాడు. పూజారి ఆ వరానికి అమలు జరగనివ్వడే!**

చిలకపేటలో రయితులు మూడేండ్ల శిస్తులు బకాయిపడ్డారు. వాళ్ళని దివాకరరావు నానాతిప్పలు పెట్టాడు. వాళ్ళందరు పేదరైతులు. పోయి దొరగారితో చెప్పుకొన్నారు.

దొరగారు సగానికి సగం రాయితీ చేశారు. చేశాడన్న ఫలితమేమున్నది. దివాకరరావు దానిని సాగనీయలేదు. అంతా యిమ్మన్నాడు. దొరగారు సగం రాయితీ జేశారయ్యా అంటే, ఆ సంగతి తనకి తెలియదంటాడు.

మళ్ళీ దొరగారితో పోయి చెప్పుకొన్నారు. ఆయన దివానుకు కాగితం వ్రాశారు. అదీ బుట్టదాఖలే అయింది.

ఈ సంగతి అందరికీ తెలుసు. దొరగారి దగ్గరకు వెళ్ళి ప్రయోజనం లేదని. ప్రయోజనం లేదంటే వున్నది. ఆయన ధర్మరాజు. అంతటి జాలిగుండె గలవాడు లేడు. ఏకపత్నీవ్రతుడు. అబద్ధం కలలోనైనా ఆడడు. ధనవంతుడూ, పేదవాడూ అనే భేదం లేదు. ఆ దొరగారికి కోపం రావటం అనేది ఎవరూ యెరగరు. ఆయన కన్ను ఒక పేదవానిమీద పడితే ఆ పేదవాడు ధనవంతుడైనాడన్నమాట. ఆయన అనంత సద్గుణ గణాంబోధి. మరి ఆ జమీలో ఆయన శీలాన్ని గురించి చాలా ప్రతిష్ఠ. ఎందుకంటే సామాన్యంగా దొరలు తక్కిన మంచి గుణాలు వున్నా యేకపత్నీ వ్రతులు మాత్రం యెవ్వరూ కారు. ఆయనకు నలభై ఏండ్లు వచ్చేవరకూ బ్రహ్మచారి. ప్రజలందరూ వెళ్ళి ఆయన్ని ప్రార్థిస్తే వివాహం చేసుకొన్నాడు. చేసుకున్న తరువాత పదేళ్ళకాయనకు సంతానము కలిగింది. దొరగారికి ఇప్పుడు డెబ్బైఏండ్లు. యువరాజుకు ఇరవై యేండ్లు. దొరగారి బొమ్మ దేవుడి బొమ్మవలె పెట్టి ఆ పరగణా పరగణా అంతా పూజిస్తూ వుంటారు. రెండు మూడు వూళ్ళల్లో ఆయన శిలా విగ్రహం కూడా వేశారు. ఆయన సర్వసద్గుణాలకు మించిన యేకపత్నీ వ్రతం చెప్పినవాడు చెప్పకుండా చెప్తుతూ వుంటాడు.

దివాకరరావు దివాన్జీ. ఆయనకు షుమారు ముప్పై ఏండ్ల పైన వుంటవి. ఆయన పదిహేను ఏండ్ల బట్టి దివాన్జీగా వచ్చాడు. ఈ పదిహేనేండ్లు ఎండ కాయటమే తప్ప తగ్గటమేలేదు. ఈ దివాన్‌గారి మీద వందలమీద వందలు ఫిర్యాదులు వెడతాయి దొరగారి వద్దకు. దొరగారు వింటాడు. సామాన్య విషయాలైతే "కొండయ్యా! ఆ దివాన్‌గారు వింటం లే"దంటాడు. పెద్ద పెద్ద విషయాలైతే తాను వారికి అనుకూలంగా వ్రాస్తాడు. ఆ వ్రాసిన వాటిల్లో ఒక దానికీ అమలు జరుగదు. అంతదాకా యెందుకు? ఒకప్పుడొక కవి వచ్చాడు. దొరగారాయనకు వెయ్యి రూపాయలిమ్మని దివానుగారికి వ్రాశాడు. దివాన్ గారు ఏణ్ణర్థం తిప్పాడు. ఆ కవిగారికి విసుగుపుట్టి మానేశాడు. పోయి దొరగారితో చెప్పకుందామనుకున్నాడు. "ఎందుకయ్యా. అనవసరం. ఆయన మళ్ళీ కాగితం వ్రాస్తాడు. ఈయన మళ్ళీ బుట్టదాఖలు చేస్తాడు, ఊరుకో"మన్నారు నలుగురూ.

ఒక్కొక్కప్పుడు దొరగారు దివాన్జీ గారూ ఒకటేను; కలిసి ఈ నాటకం ఆడుతున్నారు, అని అనుకోటానికి చాలా వీలున్నది. కాని ఆ పరగణాలలో ప్రజలు ఒక్కరైనా అట్లా అనుకోరు. ఎందుకంటే? దొరగారి గుణసంపత్తి అందరికీ తెలుసు. పైగా అలా అనుకోటానికి ఏమీ వీలులేదు. కొన్ని కొన్ని విషయాలలో దొరగారు తన సొంత డబ్బు ఇస్తాడు. ఒకసారి రాసంపాటి రైతులు కాలవ త్రవ్వించుకోవాలని తబిరీకు వేసుకున్నారు. వాళ్ళకు చాలలేదు. దొరగార్ని అడుగుదామనుకున్నారు. దొరగారు వెయ్యిరూపాయిలు వేశాడు. దివాకరరావు దమ్మిడీ వెల్లుబడి కానివ్వలేదు. ఆ తాణామీదికి వెళ్ళి వసూలు చేయమంటాడు, ఈ తాణా మీదికెళ్ళి వసూలు వెయ్యమంటాడు. పోయి, తాణాదార్ల నడిగితే "ఆయన రహస్యంగా మాకు ఇవ్వద్దని చెప్పాడయ్యా" అన్నారు.

నాలుగైదు నెలలు గడిచాయి. ఆ రైతులు పోయి దొరగారితో చెప్పుకున్నారు. దివాన్‌గారి మీద ఇలాంటివి

## దొరగారు-దివాన్జీ

వంద విషయాలు. దివాకరరావుమీద ఎన్ని చెప్పారో అన్ని చెప్పారు. ఈ దివాన్ మీకు పనికిరాడన్నారు. "అయ్యా! చంద్రుడిలో మచ్చ చంద్రుడికి శోభ. మీకు ఈ దివాన్జీ శోభ" అన్నారు. దొరగారు నవ్వుతాడు. ఊరుకొంటాడు. మరీ కోపం వస్తే కాగితం తీసుకొని వ్రాస్తాడు. దాంతో దొరగారి కోపం పూర్తయి వూరుకొంటుంది. కాని ఈ రాసంపాటి రైతుల వ్యవహారం వూరిమీది వ్యవహారం. వ్యక్తి విషయం కాదు. అందులో కొందరు సంపన్నులైన రైతులు గూడా వున్నారు. వాళ్ళు తెగబడి దివాకరరావును ఎన్నిమాటలనాలో అన్ని మాటలు అన్నారు. రాజాగారు ఆ వెయ్యిరూపాయిలు తన చేతిలోనుంచి ఇచ్చాడు. ఇలా చాలా మొత్తాలు దొరగారి చేతిలోనుంచి ఇచ్చినవి వున్నాయి. అలాంటప్పుడు దొరగారు దివానుగారితో షరీకని చెప్పటమెలాగ?

మరీ ఒకప్పుడు దొరగారు రాణీగార్నించి అప్పు తెచ్చి ఇలాంటి ఒక ధర్మాన్ని పాలించాడు. కనుక ఆ ప్రభువు నిష్కళంకుడు. ఆయనకు వున్న కళంకం ఈ దివాన్ ఒక్కడే.

మరి దివాన్‌ను ఎందుకు తీసివేయడు?

ఆ దేవిడీలో ఒకసారి ఉద్యోగం ఇస్తే మళ్ళీ తీసి వెయ్యటం ఎప్పుడు జరిగింది? వాళ్ళు పడి తింటూ వుండడమే! ఆలనా పాలనా లేదు. అదుపూ ఆజ్ఞా లేదు. ఇలా చాలా దుర్మార్గాలు చేసిన ఉద్యోగుల్ని రెండు మూడు వందల ఏండ్లమీద ఒకటి రెండుసార్లు ఆ దివాణంలో తీసివెయ్యటం వున్నది.

పూర్వం ఒక నిఘామాను, వాడే జమీందారల్లే నటించాడు. ఐదారు ఏళ్ళు వాడి ఆటలు సాగినాయి. ఈ దొరగారే వాణ్ణి తీసివేశాడు. తీసివేశాడు కాని వాడి జీవితానికంతకూ సరిపోయే ఆస్తి యిచ్చాడు. అలాగే ఈ దివానుకు ఇచ్చుకోమనండి, ఎవరు వద్దన్నారు? పైగా దివాకరరావు ఎన్నిసార్లో అన్నాడు గదా, "ఆయన దొరగారేమిటి, నేనే దొరగా"రన్నాడు. ఈ సంగతే దొరగారికి తెలిసి 'ఆహా అలా అన్నాడా? మరి ఆయనే జమీందారుగారు కాబోలు' అని నవ్వాడు.

పరగణాలో జరిగే ఈ విషయాలు అలా అట్టే పెట్టండి. రాణీగారికి డబ్బు కావలిస్తే దిక్కులేదు. దివాను ఇస్తే ఇచ్చినట్లు, ఇవ్వకపోతే ఇవ్వనట్లు. కాని పరగణా అంతా ఈ దివాను పోతేగాని తమకు బ్రదుకుదల లే దనిపించింది. దొరగారివల్ల ఏమీ లాభంలేదు. యువరాజుగారికి ఇరవై ఏండ్లు వచ్చాయి. ఆయన ఆధునిక విద్యావిధానంలో ఆరితేరాడు. ఆయన రావాలి, పరగణా కొత్త పంపిణీ మీద నడవాలి అనుకున్నారు. ఆయన కత్తివంటివాడు. ఏదైనా మాట్లాడినా సరే చేసినా సరే ఖచ్చితంగా చేస్తాడు. తండ్రి అంటే మహాభక్తి. 'నాయనగారిని దాటిపోనీయండి, జమీందారీ నా

చేతిలోకి వచ్చిన మర్నాడు ఈ దివాను వుండడు' అన్నంత తీక్షత కనిపిస్తుంది. నోటితో 'తండ్రి దాటి పోవటం' అవనలేదు.

కాని ప్రజలకు బాగా ధైర్యం కలిగింది. యువరాజు జమీందారు అయిన మర్నాడు దివాన్‌గారికి యత్తేయజ్ఞం తప్పదు.

దొరగారికి జబ్బు చేసింది. ఆయన పరమపదించారు. కాని యింకా పది నిమిషాలకు ప్రాణం వదలుతారనగా తన గదిలో యెవరూ వుండగూడదన్నారు. ఒక్క యువరాజునే వుండమన్నారు. ఆయనతో యేదో రహస్యం చెప్పారు. ఆ రహస్యం ఏమిటో యెవరికీ తెలియదు తప్ప ఏదో రహస్యం చెప్పారని నూటయాభై గ్రామాల్లోనూ తెలుసు.

తర్వాత వాల్గు నెలలకు యువరాజుకు పట్టాభిషేకము చేశారు. పట్టాభిషేకపు ఖర్చులలో దివాను యేమీ జోక్యం కల్పించుకోలేదు. అందరూ బ్రతకనేర్చిన ముండావాడన్నారు. క్రొత్త పరిపాలన ప్రారంభించింది.

ఏడాది ఏణ్ణర్థం గడిచేటప్పటికి మళ్ళీ పాత తతంగమే మొదలు పెట్టింది. రాజాగారి అనుజ్ఞ అవడమే తప్ప మంత్రిగారి దగ్గర లక్ష్మి పలుకదు. మళ్లీ దొరగారి దగ్గర ఫిర్యాదులు ప్రారంభించినవి. ఈ దొరగారికి చాలా కోపం వస్తుంది. ఈయనా ఏమీ చేయదు. పెద్ద దొరగారికీ, ఈ దొరగారికీ ఒకటే భేదం. మంత్రిమీద ఫిర్యాదులు చెపితే పెద్ద దొరగారు నవ్వేవాడు. ఈయనకు కోపం వస్తుంది. ఇంతే భేదం. దివాకరరావు ఉద్యోగం అప్పుడూ భద్రంగానే వుంది. ఇప్పుడూ భద్రంగానే వుంది; ఆటలు అప్పుడూ భద్రంగానే సాగాయి. ఇప్పుడూ భద్రంగానే సాగుతున్నాయి.

ఈ దొరగారి వివాహం అయింది. ఆవిడ యింతకంటే పెద్ద జమీందారుల పిల్ల. బాగా చదువుకొన్నది. ఘోషా మొదలైనవి తీసేసింది. ఊరివెంట గుర్రపు షికారు వెడుతుంది. టెన్నీసు ఆడుతుంది. ప్రజలు తమ పనులేమైనా వుంటే ఆవిడతో కూడా పోయి మనవి చేసుకోవచ్చు. ప్రజలు ఈ దొరతో లాభం లేదని విసిగిపోయి దివాన్‌మీద ఫిర్యాదులు ఆవిడతోనూ చెప్పడం మొదలుపెట్టారు. ఆవిడ చాలాసార్లు భర్తతో మాట్లాడింది. ఆయన ఏమీ సమాధానం చెప్పలేదు.

ఇది ఇలా వుండగా ఆ దొరగారు సాగించే కొన్ని పాఠశాలలు వున్నాయి. ఒక పాఠశాలాధ్యక్షుడు దివానుకు దగ్గర చుట్టం. అతను ఆ పాఠశాలను ఎంత అధ్వాన్నంగా చెయ్యాలో అంత అధ్వాన్నంగా చేశాడు. అతడా వూళ్ళో విశృంఖలంగా ప్రవర్తిస్తున్నాడు. అతన్ని తీసివేయక తప్పదని పూర్వపు దొరగారితోనూ చెప్పారు. ఇద్దరు దొరలూ అతన్ని తొలగించవలసిందని ఆయన పదిసార్లు, ఈయన పదిసార్లు, ఆజ్ఞాపత్రాలు పంపారు. ఆయన మాత్రం అక్కణ్ణించి కదల్లేదు. వడ్డించేవాడు మనవాడైతే కడపంక్తిని కూర్చున్నా ఫరవాలేదన్నట్లుంది వాడి స్థితి. ఆ వూరి రైతులు ఆ పాఠశాల వార్షికోత్సవానికి చిన్నరాణీగారిని తీసికెళ్ళి ఆవిడచేత పిల్లలకు బహుమానాలిప్పించారు. ఆవిడ పాఠశాల చూచింది. ఆ అధ్యక్షుడి మూలంగ బడి అంతా అల్లకల్లోలంగా వుందని తెలుసుకుంది. పిల్లలకు ఉపాధ్యాయుడంటే గౌరవం లేదు. ఊళ్లో అతనంటే లెక్కలేదు.

ఇంటికి తిరిగివచ్చి భర్తతో చెప్పింది. అతన్ని



తీసివేయాలని పట్టుపట్టింది.

అతన్ని తీసి వెయ్యడానికి ముందు దివాన్ని తీసి వెయ్యాలి.

దివాననే తీసివెయ్యమని పట్టుపట్టి కూర్చుంది.

ఇలా నాలుగురోజులు గడిచాయి.

చివరకు రాణీగారు ఐదవరోజున దొరగారిని నిగ్గదీసి అడిగింది.

దొరగారు "ఇది యొక రహస్యం" అన్నాడు.

చివరకు చెప్పక తప్పింది కాదు! "మా నాయనగారు చనిపోయేముందు నాకీ రహస్యం చెప్పారు."

"ఏమిటా రహస్యం?"

"మా నాయనగారికి నలుబదవయేట పెండ్లయినది."

"దానికీ దీనికీ యేమి సంబంధం?"

"ఆ దివాన్ నాకు అన్నగారు."